నాడు అదుర్స్... నేడు అధ్వానం..!



వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రారంభించిన బస్ షెల్టర్



ప్రస్తుతం రూపురేఖలు మారిపోయిన పోర్టు హాస్పిటల్ బస్ షెల్టర్



బస్ షెల్టర్‌లో సీలింగ్ లైట్లు మాయమైన ప్రదేశం



స్విచ్ బోర్డు వద్ద వేలాడుతున్న వైర్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అత్యాధునిక హంగులతో నిర్మించిన బస్ షెల్టర్ తదనంతర కాలంలో నిర్వహణ లేక అధ్వానంగా మారింది. జీవీఎంసీ 45వ వార్డు పరిధి పోర్టు హాస్పిటల్ వద్ద జాతీయ రహదారిపై నిర్మించిన బస్ షెల్టర్ ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. సుమారు రూ.26.90 లక్షలతో అత్యాధునిక హంగులతో నిర్మించిన ఈ షెల్టర్ నిర్వహణను జీవీఎంసీ అధికారులు పూర్తిగా గాలికొదిలేశారు. ఫలితంగా షెల్టర్‌లోని సీలింగ్ లైట్లు మాయమైపోయాయి. వాటికి సంబంధించిన వైర్లు గాలిలో వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ముందు భాగంలో గల బోర్డుకు సంబంధించిన లైటింగ్ వ్యవస్థ కూడా పూర్తిగా మాయమైంది. ఇక్కడ ఉండాల్సిన లైట్లు, నేమ్ బోర్డు అక్షరాలు మాయమై వైర్లు మాత్రం గాల్లో వేలాడుతున్నాయి. మెయిన్ బోర్డు, స్విచ్ బోర్డుల వద్ద కూడా రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. పొరపాటున పిల్లలు, విద్యార్థులు ఆ వైర్లు తాకితే కరెంటు షాక్‌కు గురవ్వాల్సిందే. ఈ షెల్టర్ కింద బస్సులకోసం నిరీక్షించేందుకు ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. నగరంలోని షెల్టర్లు బాగున్నా... ఇక్కడ మాత్రం అధ్వానంగా తయారైందని... అధికారులు మరమ్మతులు చేసి సుందరంగా తీర్చిదిద్దాలని ప్రయాణికులు కోరుతున్నారు. – తాటిచెట్లపాలెం

భూ వివాదాల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు



తహసీల్దార్ రమేష్

సీతమ్మధార : ప్రజల సమస్యలు, భూ వివాదాల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని విశాఖ అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ వెల్లడించారు. సీతమ్మధారలో గల కార్యాలయంలో ఆయన 'సాక్షి'తో గురువారం మాట్లాడారు. ఈ నెల 6 నుంచి జనవరి 8 వరకు సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 6న రేసపువానిపాలెం రెవెన్యూ విలేజీ ప్రాంత ప్రజలకు తమ కార్యాలయంలో, 9న మద్దిలపాలెం ప్రాంత ప్రజలకు 109వ నంబర్ సచివాలయం, 11న పెద వాల్తేరు ప్రాంత ప్రజలకు 99వ నంబర్ సచివాలయం, 13న చినవాల్తేరు ప్రజలకు ఎంవీపీ కాలనీ లుంబినీపార్కు ఏరియాలోని కల్యాణ మండపంలో, 16న వెంకోజీపాలెం వాసులకు ఎంవీపీ కాలనీ నేతాజీపార్కులో గల 105వ నంబర్ సచివాలయంలో, 18న దొండపర్తి ప్రాంత ప్రజల కోసం అక్కయ్యపాలెంలోని షాదీఖానాలో, 20న అల్లిపురం ఎక్స్‌టెన్షన్ వార్డు ప్రజలకు అక్కయ్యపాలెంలోని షాదీఖానాలో సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. భూ సమస్యలకు సంబంధించిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. సదస్సుల్లో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొంటారని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మానవ పరిణామంలో టెక్నాలజీ కీలకం



ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులతో అతిథులు, ఉపాధ్యాయులు

మురళీనగర్ : మానవుడి పరిణామ క్రమం సైన్స్ అండ్ టెక్నాలజీతో ముడిపడి ఉందని ఎమ్మెల్సీ పి.రవీంద్ర బాబు అన్నారు. కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నిర్వహిస్తున్న ప్రాంతీయ టెక్ ఫెస్ట్ – 2024 ముగింపు సమావేశం గురువారం సాయంత్రం నిర్వహించారు. పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు శాస్త్రీయమైన భావాలు పెంపొందించుకొని సమాజాభివృద్ధికి దోహదపడాలని కోరారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ మాట్లాడుతూ దేశంలో నైపుణ్యంతో కూడిన మానవ వనరుల కొరత ఉందని, నేటితరం యువతీ యువకులు నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని సూచించారు. విదేశాలతో పోల్చుకున్నప్పుడు మన దేశంలో 51 శాతం యువత నైపుణ్యం లేనివారు ఉన్నారన్నారు. నైపుణ్య సాధన దిశగా పాలిటెక్నిక్ విద్యార్థులు పయనించాలని సూచించారు. రెండు రోజులుగా నిర్వహించిన పాలిటెక్ ఫెస్ట్‌లో మొదటి రెండు స్థానాలు సాధించిన ప్రాజెక్టులకు నగదు బహుమతులు అందించారు. మొదటి స్థానంలో నిలిచిన ఆల్వార్ దాస్ పాలిటెక్నిక్ విద్యార్థులు రూపొందించిన గ్రావిటేషనల్ బ్యాటరీ ప్రాజెక్టుకు రూ.25 వేలు, రెండో స్థానంలో నిలిచిన కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇన్‌స్టిట్యూట్ (గైస్) విద్యార్థులు రూపొందించిన యూఏవీ ప్రాజెక్టుకు రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య, కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ బి.బాలకృష్ణ, తుమ్మడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మిడి రామ్ కుమార్, సాంకేతిక విద్యాశాఖ కాకినాడ రీజినల్ డైరెక్టర్ జె.సత్యనారాయణ మూర్తి, డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్, గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు ఆరోగ్య కార్డులు



ఆరోగ్య కార్డులో వివరాలు నమోదు చేస్తున్న ఆశావర్కర్లు

సీతమ్మధార : రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం కింద పాఠశాల స్థాయి విద్యార్థులకు కార్డులు జారీ చేస్తున్నారు. ఈ మేరకు సీతమ్మధార దరి పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా కార్డులు అందిస్తున్నారు. రేసపువానిపాలెంలోని పట్టణ ఆరోగ్య కేంద్రానికి చెందిన ఆశావర్కర్లు విద్యార్థుల పూర్తి వివరాలను ఆరోగ్య కార్డులో నమోదు చేసి ఇస్తున్నారు. పేరు, వయసు, తరగతి, ఆధార్ నంబర్ తదితర వివరాలు సమగ్రంగా నమోదు చేస్తున్నారు. ఈ కార్డులను పాఠశాలలోనే భద్రపరుస్తున్నారు. విద్యార్థులు పాఠశాల చదువు అయిపోయిన తర్వాత వారికి ఇస్తారు. ఎప్పుడైనా అనారోగ్యానికి గురైతే సదరు విద్యార్థులను ఆరోగ్య కేంద్రానికి సిఫారసు చేస్తారు. ఈ పాఠశాలలో 900 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



శివశంకర్‌కి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార : జీవీఎంసీ 49వ వార్డులో గల అయ్యప్పనగర్‌కి చెందిన కాంచరపు శివ శంకర్‌కి ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్‌రాజు రూ.2 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు శివశంకర్ మాట్లాడుతూ కేవలం వారం రోజుల సమయంలోనే తమకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించారని సంతోషం వ్యక్తం చేశారు. తదుపరి చికిత్స నిమిత్తం వైద్యులు విజయవాడలోని ఎయిమ్స్ ఆస్పత్రికి సిఫారసు చేశారని తెలిపారు. కార్యక్రమంలో అతని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

8న జర్నలిస్టుల వన సమారాధన



మాట్లాడుతున్న సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు

సీతంపేట : నగరంలోని శివాజీ పార్కులో ఈ నెల 8న జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేకంగా వన సమారాధన నిర్వహిస్తున్నట్టు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ అర్బన్ అధ్యక్షుడు పి.నారాయణ్, కార్యదర్శి జి.శ్రీనివాసరావు తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం అల్పాహారంతో ప్రారంభమై, మౌనిక కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, లక్కీ డిప్, మధ్యాహ్నం విందు భోజనం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

7న చిన్న జీయర్ స్వామి రాక

ఎంవీపీకాలనీ: ఈ నెల 7న త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి ఎంవీపీ కాలనీకి తరలిరానున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు సెక్టార్–6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయాన్ని స్వామీజీ సందర్శించనున్నారని ఆలయ కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. వివిధ ఆలయ కార్యక్రమాల్లో స్వామీజీ పాల్గొంటారని, భక్తులు ఆలయానికి తరలిరావాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

గొడౌన్ కాదు... రోడ్డే..!



లలితానగర్ రోడ్‌పై ఫ్రిజ్‌లు, ఏసీలు

సీతంపేట : నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది స్థానికులు రాకపోకలు సాగించే రహదారి గొడౌన్‌గా మారింది. పాడైన ఫ్రిజ్‌లు, ఏసీలు వందల సంఖ్యలో రహదారిని ఆక్రమించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని స్థానికులు వాపోతున్నారు. జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం, లలితానగర్ రోడ్‌లో ఒక షోరూం వ్యాపారి తన వద్దకు మరమ్మతులు, మార్పుల కోసం వచ్చే ఫ్రిజ్‌లు, ఏసీలను రోడ్డుకు ఇరువైపులా వందల సంఖ్యలో పేర్చారు. నెలల తరబడి ఎండైనా, వానైనా రోడ్డుపైనే ఉంటున్నాయి. రెసిడెన్షియల్ ఏరియాలో రోడ్‌ను ఆక్రమించి వందల సంఖ్యలో ఫ్రిజ్‌లు, ఏసీలు పడేసినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ఫ్రిజ్‌లు, ఏసీలలో ఉండే కంప్రెసర్లు ఏదైనా ప్రమాదం వల్ల పేలితే పరిస్థితి ఏంటని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జీవీఎంసీ, పోలీస్ అధికారులు చొరవ తీసుకుని రోడ్‌పై ఆక్రమణలు తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని పలువురు కోరుతున్నారు.

ఈ వాహనాలు ఎవరివో..?



నక్కవానిపాలెంలో రోడ్డు పక్కన చాలా రోజులుగా నిలిపి ఉంచిన వాహనాలు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో రోడ్డు పక్కన వాహనాలు చాలా రోజులుగా పార్కింగ్ చేసి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక్కడి సత్యం జంక్షన్ దరి క్రాంతినగర్ రోడ్డులో నాలుగు ద్విచక్ర వాహనాలు గత నెల రోజులుగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పార్కింగ్ చేసి వెళ్లి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. పోలీసు కేసుల కారణంగానే సదరు వ్యక్తులు ఇక్కడ వాహనాలు వదిలి వెళ్లి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వరుసగా ఒకదానివెంట మరొకటి పార్కింగ్ చేసి వుండడం గమనార్హం. ఎంవీపీ ట్రాఫిక్ పోలీసులు స్పందించి వెంటనే ఈ వాహనాలు ఇక్కడి నుంచి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఫైనల్ డయాగ్నోసిస్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కరుణరాజు, తదితరులు

మహారాణిపేట: విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో గురువారం సాయంత్రం విశాఖ అరసం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఎం. సుగుణాకరరావు రచించిన 'ఫైనల్ డయాగ్నోసిస్' పుస్తకావిష్కరణ జరిగింది. అన్వేక్షి ఉగాది నవలల పోటీలో ఈ నవల బహుమతి పొందింది. ఈ కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. కరుణరాజు ముఖ్య అతిథిగా హాజరు కాగా, సభకు అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించారు.

అరసం విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. హనుమంతరావు స్వాగతం పలుకగా ప్రముఖ కవి గరిమెళ్ల నాగేశ్వరరావు పుస్తకాన్ని సమీక్షించారు. ప్రముఖ కవి డాక్టర్ బండి సత్యనారాయణ పుస్తకాన్ని పరిచయం చేశారు. రచయిత డాక్టర్ సుగుణాకరరావు తన స్పందన తెలియజేశారు. అరసం కార్యవర్గ సభ్యులు బసుపోతన వందన సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో గూడురు సీతామహాలక్ష్మి, పలువురు రచయితలు, కవులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన మార్గంలో పరిశీలన



సీఎం పర్యటించే మార్గంలో పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్, అధికారులు

డాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించే మార్గంలో పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు తదితర పనులు పూర్తి చేసి రోడ్లు, పరిసర ప్రాంతాలు అందంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రయాణించే విశాఖ ఎయిర్‌పోర్టు, కాకానినగర్, ఎన్ఏడీ, తాటిచెట్లపాలెం, న్యూకాలనీ, తెలుగుతల్లి ఫ్లైఓవర్, రాంనగర్‌లో గల టీడీపీ కార్యాలయం, నోవాటెల్, వీఎంఆర్‌డీఏ కార్యాలయం తదితర ప్రాంతాల్లో జీవీఎంసీ అధికారులతో కలిసి గురువారం కమిషనర్ పర్యటించారు. జాతీయ రహదారి కాకానినగర్ నుంచి రోడ్డు మార్గంలో ఉన్న చెట్ల కొమ్మలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, ఎక్కువ విద్యుత్ కాంతి ఉండేలా చెట్ల కొమ్మలు తొలగించాలని డీడీహెచ్ దామోదరరావును ఆదేశించారు. అలాగే రోడ్డు పక్కనున్న వ్యర్థాలు తొలగించడంతో పాటు కాల్వలను శుభ్రపరచాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌ను ఆదేశించారు. సీఎం పర్యటించే మార్గంలో పశుసంచారణ లేకుండా చూడాలని సిటీ పశు వైద్యాధికారి కిషోర్‌కుమార్‌ను ఆదేశించారు. పర్యటనలో పర్యవేక్షక ఇంజనీర్లు సంపత్‌కుమార్, పీవీవీ సత్యనారాయణరాజు, జోనల్ కమిషనర్లు బి రాము, హేమావతి, వైద్యాధికారులు సునీల్‌కుమార్, డాక్టర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

32 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం ఉన్నతాధికారుల ఆదేశాలతో విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫరీద్ సాహో, సిబ్బంది, స్నిఫర్ డాగ్ (భీమ) సహాయంతో రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌కు చెందిన డానిష్ అనే వ్యక్తి 32 కేజీల గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకుని, గంజాయి సీజ్ చేశారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

హౌసింగ్ డీడీలు వాపస్



దరఖాస్తుదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార : గతంలో దరఖాస్తు చేసినా పక్కా ఇళ్లు రాని దరఖాస్తుదారులకు డీడీలను వాపస్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం కొంతకాలంగా హౌసింగ్ డీడీ మొత్తాలను వాపస్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బాలయ్య శాస్త్రి లే అవుట్ వద్ద గల బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు డీడీల మొత్తాలను వాపస్ చేశారు. ఈ సందర్భంగా 19 మంది దరఖాస్తుదారులకు రూ.41 లక్షల మేర చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ రాము, యూసీడీ విభాగం ఏపీడీ పుణ్యవతి పాల్గొన్నారు.

కృష్ణా కళాశాల లైబ్రరీకి పుస్తకాల వితరణ

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి రిటైర్డ్ గణిత ఉపాధ్యాయుడు జగన్నాథం మాస్టర్ తన సొంత నిధులు రూ.50 వేల విలువైన పుస్తకాలను వితరణ చేశారు. ఈ పుస్తకాలను గురువారం అందించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. ప్రముఖుల జీవితగాథలు, చారిత్రక గ్రంథాలు, తెలుగు సాహిత్య పుస్తకాలను ఇచ్చిన జగన్నాథం మాస్టర్ దాతృత్వం ఆదర్శనీయమని ఆయన కొనియాడారు. విలువైన ఈ పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచేందుకు కళాశాల గ్రంథాలయాధికారి శ్రీనివాస ప్రసాద్‌కు అందజేశామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రావణకుమార్, అకాడమీ అడ్వైజర్, రవిబాబు, రాజేశ్వరరావు, పోలా ఉమామహేశ్వరరావు, అప్పారావు, జి.విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'హోలిస్టిక్ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్' పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు, తదితరులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో ఇటీవల నిర్వహించిన జాతీయ సదస్సు పరిశోధనా పత్రాల సంకలనం రెండో సంచిక మల్టీ డిసిప్లీనరీ అండ్ హోలిస్టిక్ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్‌ను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంపై నిర్వహించిన జాతీయ సదస్సు నూతన ఆలోచనలను, విశ్లేషణలను, పరిష్కార మార్గాలను అందించిందన్నారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన నిపుణుల చర్చలు, కీలక ఉపన్యాసాలు విలువైన సూచనలు నూతన విద్యా విధానాన్ని మరింత బలోపేతం చేయడానికి ఉపయుక్తంగా నిలుస్తాయని చెప్పారు. ఈ పుస్తక సంపాదకులను అభినందించారు. ప్రత్యేక సంచిక సంపాదకులు, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, డాక్టర్ బి.ప్రవీణదేవి, డాక్టర్ ఎం.సాల్మన్ రాజు, ఎం.వి.ఎస్.ఎస్.ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

7న సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి



సుబ్రహ్మణ్యస్వామి

కంచరపాలెం : మార్గశిరమాస శుక్ల పక్ష జన్మషష్ఠి మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7న కంచరపాలెం ఊర్వశి కూడలి రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించనున్నట్లు శరవణ్ ట్రస్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దేవాల రాజు తెలిపారు. కలశ స్థాపన, గోక్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, పన్నీరు, చందనాభిషేకాలు, ప్రత్యేక పూజలు, సాయంత్రం వల్లీ దేవసేన సమేత స్వామికి కల్యాణం, అనంతరం ఊయల సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని కోరారు.

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల శ్రీ మహా గణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, శ్రీ షిరిడీ సాయిబాబా దేవస్థానంలో సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు ఈ నెల 7న నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్‌బాబు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక అభిషేకాలు చేస్తామని తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాల భక్తులంతా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ నెల 16 నుంచి జనవరి 13 వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

నాట్య కళాక్షేత్రం వార్షికోత్సవాలు రేపు



వార్షికోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాకారులు

సీతమ్మధార : నాట్య కళాక్షేత్ర 24వ వార్షికోత్సవాలు ఈ నెల 7న పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తామని నాట్య గురువు కె.వెంకట్ వెల్లడించారు. ఈ మేరకు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల సంస్థ కార్యాలయంలో గురువారం వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవాలను పురస్కరించుకుని తమ సంస్థ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారని తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సీహెచ్.సన్యాసిపాత్రుడు, కూచిపూడి, భరతనాట్యం ఎక్స్‌పోనెంట్ (వరంగల్) బి.సుధీర్‌రావు, డ్యాన్స్ ఇండియా మేగజైన్ చీఫ్ ఎడిటర్ బీఆర్ విక్రమ్ కుమార్, కళాభారతి ట్రస్టీ జీఆర్‌కే ప్రసాద్ (రాంబాబు), విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కె.వెంకటరమణారావు, నాట్యరవళి మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు యు.మహేష్‌బాబు పాల్గొంటారని తెలిపారు. నగర వాసులు, కళాభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన ముఖ్యం



మాట్లాడుతున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: పరిశోధనా రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలపై ఎప్పటికప్పుడు అవగాహన పొందాలని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. కెమిస్ట్రీ విభాగంలో గురువారం నానో మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ, కెటాలసిస్ అండ్ ఎన్విరాన్మెంట్ జాతీయ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్న నానో మెటీరియల్స్‌పై సదస్సు నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ వర్తమాన అంశాలను పరిశోధకులకు పరిచయం చేయడానికి, విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించడానికి ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. ఈ రంగంలో నిష్ణాతులతో ప్రత్యేక ప్రసంగాలు ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రా మెడికల్ కాలేజ్ ఆచార్యుడు డాక్టర్ జి.రఘురామారావు నానో మెడిసిన్స్ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల మాట్లాడుతూ మూడు రోజుల జాతీయ సదస్సులో ఏయూ కెమిస్ట్రీ విభాగంలో చదువుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరినీ భాగం చేస్తూ వారినే వక్తలుగా ఆహ్వానించి ప్రత్యేక ప్రసంగాలలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడిటెక్ గ్లోబల్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ హెచ్.పురుషోత్తం, సదస్సు కన్వీనర్ ఆచార్య టి.శివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఆచార్య వి.సిద్ధయ్య ఆచార్య కె.బసవయ్య, ఆచార్య శైలజ తదితరులు ప్రసంగించారు.